క్లుప్తంగా

కోటదుర్గమ్మకు ఆషాఢం సారె

వీరఘట్టం: వీరఘట్టం ఇలవేల్పు శ్రీ కోటదుర్గమ్మకు గురువారం భక్తులు ఆషాఢం సారె సమర్పించారు. స్థానిక బార్నాలవీధికి చెందిన పప్పల మహేష్ దంపతులు మేళతాలతో కోటదుర్గకు ఆషాఢం సారె సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం దుర్గమ్మ దర్శించుకున్నారు.

విత్తనాల పంపిణీ



రైతులకు విత్తనాలు అందజేస్తున్న ఎమ్మెల్యే

గరుగుబిల్లి: మండలంలోని రావివలస గ్రామంలో రైతు సేవా కేంద్రం సహా ఇంటింటి తాగునీటి కుళాయిలను ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి గురువారం ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అనంతరం రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు.

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం రేపు

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని చిన మేరంగి కోటలో వైఎస్సార్ సీపీ కురుపాం నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం శనివారం నిర్వహిస్తున్నట్లు పార్వతీపురం మన్యం జిల్లా పార్టీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. ఈ సమావేశానికి నియోజకవర్గ నలుమూలల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలంతా హాజరుకావాలని కోరారు.

శాకంబరి అవతారంలో కొత్తవలస దుర్గమ్మ



శాకంబరి అవతారంలో కొత్తవలస దుర్గమ్మ

పార్వతీపురంటౌన్: పట్టణంలోని కొత్తవలస దుర్గమ్మ ఆలయంలో గురువారం అమ్మవారు శాకంబరి అవతారంలో దర్శనమిచ్చారు. ఆషాడ మాసంలో శాకంబరి దేవిగా ఆమ్మవారిని దర్శించుకోవడం అదృష్టమని భక్తులు భావిస్తారు. దీంతో ఆలయ కమిటీ వారు దాతల సహకారంతో వివిధ రకాల కూరగాయలు, పళ్ల ఆకుకూరలతో అమ్మవారిని అలంకరించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అమ్మవారికి సారె సమర్పించిన భక్తులు



సంగంవలసలో కోటదుర్గమ్మ సారె సామగ్రిని ఊరేగిస్తున్న మహిళలు

పార్వతీపురం రూరల్: మండలంలోని సంగంవలస గ్రామంలో వెలసిన కోటదుర్గమ్మకు భక్తులు గురువారం సారెను సమర్పించి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ముందుగా గ్రామంలో అమ్మవారికి సమర్పించే పసుపు కుంకుమ తదితర సారె సామగ్రిని ఊరేగించారు. అనంతరం కోటదుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమం విశిష్టతను అర్చకులు తెలియజేస్తూ ఆషాడ మాసంలో అమ్మవారు పుట్టింటికి వస్తారని ఈ క్రమంలో అమ్మవారికి చీరలు, పసుపు, కుంకుమ, పుష్పాలు వంటి సామగ్రి సమర్పిస్తే భక్తులు ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండేలా అమ్మవారి దీవెనలు పొందుతారని తెలిపారు. ఈ నేపథ్యంలో పంచామృతాలతో అభిషేకం, ధూప, దీప, నైవేద్యాలు అమ్మవారికి సమర్పించారు.

ఉపాధి కోర్సులకు దరఖాస్తులాహ్వానం

బొబ్బిలి: ఉచిత ఉపాధి కోర్సులకు అర్హులు దరఖాస్తు చేసుకోవా లని నిర్మాణ్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక సీఈఓ మయూర్ పట్నాల గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణులై, 28 సంవత్సరాల లోపు వయసున్న నిరుద్యోగ యువతకు టైపింగ్ స్కిల్స్,ఎంఎస్ ఆఫీస్,ఇంటర్నెట్ కాన్సెప్ట్స్,కమ్యూనికేటివ్ ఇంగ్లిష్, హెచ్‌టీఎంఎల్, సీఎస్ఎస్, ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్, టెక్నికల్ స్కిల్స్, బేసిక్ అకౌంటింగ్ స్కిల్స్ కోర్సులపై నెల రోజుల చొప్పున శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు.

● బియ్యం బండే దుకాణం.. వలంటీరే వ్యాపారి



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో బియ్యం బండి ఆధారంగా చేసుకొని లక్షల మంది జీవనోపాధి పొందారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పాత పద్ధతిలోకి రేషన్ సరుకుల పంపిణీ చేపట్టింది. దీంతో ఆ బండిని ఆధారంగా చేసుకొని అప్పటి ప్రభుత్వ హయాంలో వలంటీరుగా పని చేసిన మిన్నారావు బియ్యం బండి తన వ్యాపార దుకాణంగా మార్చి జీవనోపాధి పొందుతున్నాడు. మిన్నారావు సీతంపేట సంత నుంచి ఎండీయూ వాహనంపై పైనాపిల్ పళ్లు తెచ్చి బస్టాండ్‌లో గురువారం విక్రయిస్తూ కనిపించాడు. వలంటీరు వ్యవస్థ రద్దు, ఎండీయూ వాహనాల రద్దుతో ఈ దుస్థితి దాపురించిందని మిన్నారావును చూసిన పలువురు చర్చించుకున్నారు. - భామిని

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు



పాలకొండ రూరల్: షిర్డీసాయిబాబా మందిరం వద్ద అన్నదాన కార్యక్రమంలో భక్తులు



గరుగుబిల్లి ఆలయంలో హోమం చేస్తున్న భక్తులు

వాడవాడలా గురుపౌర్ణమి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. హిందూ సంప్రదాయం ప్రకారం గురువును పూజించేందుకు విశేషమైనదిగా గురువారాన్ని భావిస్తారు. ఈ నేపథ్యంలో గురుపౌర్ణమి కలిసివచ్చిన ఇదేరోజును ఏటా గురుపౌర్ణమి నిర్వహిస్తూ అష్టాదశపురాణాల ద్వారా సర్వమానవాళికి జ్ఞానాన్ని అందించిన వేదవ్యాసుని ఆదిగురువుగా పరిగణిస్తూ పూజలు చేస్తుండడం ఆనవాయితీగా వస్తోంది. ఇదిలా ఉంటే ఇదేరోజున షిర్డీసాయిబాబాను పూజిస్తుండడం విశేషం. విద్యాసంస్థల్లో వ్యాసుని చిత్రపటానికి పూలమాలలు వేసి, పూజించగా, ఆలయాల్లో కొలువైన బాబాను భక్తులు దర్శించి, ప్రత్యేక పూజలు, అర్చనలు, క్షీరాభిషేకాలు చేసి, గురువుల పట్ల తమకున్న భక్తిశ్రద్ధలు చాటుకున్నారు.
-పాలకొండ, కురుపాం నెట్‌వర్క్

జ్ఞాన మార్గదర్శకులు గురువులు



రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

పాలకొండ రూరల్: జ్ఞాన మార్గ దర్శకులు గురువులని నగర పంచాయతీ వైస్ చైర్మన్ రౌతు హనుమంతరావు అన్నారు. ఉత్తమ గురువు వ్యాసుని జన్మదిన వేడుకల్లో భాగంగా నిర్వహిస్తున్న గురుపౌర్ణమిని పురస్కరించుకుని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులు కె.జనార్ధనరావుని గురువారం సన్మానించారు. విద్యా రంగంలో, తెలుగు భాషా, కళలను విస్తరింపజేయడంతో పాటు యోగా శిక్షకులుగా జనార్ధనరావు కృషిని కొనియాడారు. గరుశిష్యుల అనుబంధం గొప్పదని సన్మాన గ్రహీత అన్నారు. కార్యక్రమంలో పాలవలస మణికుంత తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధిలో తల్లిదండ్రులదే కీలకపాత్ర



మాట్లాడుతున్న పీవో యశ్వంత్‌కుమార్ రెడ్డి

సీతంపేట: విద్యాభివృద్ధిలో తల్లిదండ్రులదే కీలక పాత్ర అని ఐటీడీఏ పీవో సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి అన్నారు. సామరెల్లి బాలికల ఆశ్రమ పాఠశాలలో జరిగిన మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ మీటింగ్‌కు గురువారం హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లోనూ డ్రాపౌట్ కాకుండా చదువుకోవాలన్నారు. తాను కూడా ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఈ స్థాయికి చేరుకున్నానన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఆరిక భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కొమరాడ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎస్.రమేష్ ఓ ప్రకటనలో గురువారం వెల్లడించారు. ఎంపీపీ శెట్టి శ్యామల అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు హాజరవుతున్నారని, అధికారులు కూడా అభివృద్ధి పనుల నివేదికలతో హాజరుకావాలని కోరారు.

దిగువ ప్రాంతాలకు సాగునీరు విడుదల



సాగునీరు విడుదల చేస్తున్న ఇరిగేషన్ అధికారులు

కొమరాడ: మండలంలోని జంఝావతి రబ్బరు డ్యామ్ లో లెవల్ కెనాల్ ద్వారా దిగువ ప్రాంతాలకు సాగునీరు గురువారం విడుదల చేశారు. ఈ కాలువ ద్వారా తొమ్మిది వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని బొబ్బిలి సర్కిల్ పర్యవేక్షణ ఇంజినీర్ ఆర్.అప్పారావు తెలిపారు. రైతుల విజ్ఞప్తుల మేరకు ఉన్నతాధికారుల ఆదేశాలతో ప్రస్తుతం సాగునీరు విడుదల చేయడం జరిగిందని, సద్వినియోగం చేసుకోవాలని రైతులను ఆయన కోరారు. కార్యక్రమంలో ఎం.భాస్కరరావు ఎ.ఢిల్లీశ్వరరావు, బి.రవీంద్ర, కె.అప్పలనాయుడు, బి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విత్తన శుద్ధి మేలు



రైతులతో విత్తనాలు శుద్ధి చేయిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

జియ్యమ్మవలస: మండలంలోని టీకే జమ్ము గ్రామంలో విత్తన శుద్ధిపై గురువారం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం అసోసియేట్ జి.అన్నపూర్ణ మాట్లాడుతూ విత్తనాలు వేసే ముందు వాటిని బీజామృతంతో శుద్ధి చేసుకుని వేసుకోవాలని, అలా అయితే హానికర సూక్ష్మజీవుల నుంచి రక్షణ పొంది, శతశాతం మొలకలు వస్తాయన్నారు. పైరు కూడా ఏపుగా పెరిగి పురుగులు, తెగుళ్లను పంట తట్టుకునే సామర్థ్యం కలిగి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జ్‌లు అల్లు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సైకిల్ వితరణ



విద్యార్థికి సైకిల్ అందజేస్తున్న వైస్ ఎంపీపీ నంగి రెడ్డి, ఎంఈవో నారాయణస్వామి

కొమరాడ: మండలంలోని కంబరవలస పంచాయతీ, కంచరపాడు గ్రామ విద్యార్థి కద్రక అశోక్‌కు మండల వైస్ ఎంపీపీ నంగిరెడ్డి శరత్‌బాబు సైకిల్ వితరణ చేశారు. సదరు విద్యార్థి రాజ్యలక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులు లేని ఆ బిడ్డ తాత గారి ఇంటి వద్ద నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న పాఠశాలకు వెళ్తున్నట్లు తెలుసుకున్న వైస్ ఎంపీపీ..సైకిల్ కొనుగోలు చేసి ఇచ్చి తనలోని మానవత్వాన్ని చాటుకున్నారు. గురువారం ఎంఈవో జామి నారాయణస్వామి చేతులమీదుగా ఆ విద్యార్థికి సైకిల్ అందజేశారు.

ఎనిమిది మంది జూదరుల అరెస్ట్

పార్వతీపురం రూరల్: జిల్లా కేంద్రం శివారు ప్రాంతంలో ఉన్న ఓ మిఠాయి దుకాణం సమీపంలో జూదం ఆడుతున్న 8మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.1,68,900 నగదుతో పాటు ఏడు సెల్‌ఫోన్లు, మూడు కార్లు స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ ఎస్సై గోవింద తెలిపారు. ఈనెల 8 వ తేదీన ఆంధ్ర- ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో జూదం ఆడుతూ ఒడిశా పోలీసుల కంటబడడంతో అక్కడి నుంచి పరారై మళ్లీ పార్వతీపురం పట్టణ శివారులో ఉన్న మిఠాయి దుకాణం సమీపంలో జూదం ఆటను కొనసాగించగా ముందస్తు సమాచారం మేరకు పట్టణ పోలీసులు జూదరులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి తదుపరి చర్యల నిమిత్తం పార్వతీపురం మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు.

రైతులపై కన్నెర్ర

సీతానగరం: రైతాంగంపై ప్రకృతి కన్నెర్ర చేయడంతో పాటు సర్కారు ఆదుకోకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏటా ఖరీఫ్ సీజన్‌కు ముందు రూ.20 వేలు వంతున ఆర్థికసహాయాన్ని అందిస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. ప్రభుత్వం ఏర్పడి ఏడాదిదాటి రెండవ ఖరీఫ్ సీజన్ వచ్చినా ఇంతవరకూ ఆర్థిక సహాయాన్ని అందించిన దాఖలాలులేవు. ప్రభుత్వం ఆదుకుంటుందని ఎదురు చూసిన రైతులు చివరికి వరినాట్లు వేయడానికి సిద్ధమై ప్రైవేట్ అప్పులు వాడుకుని వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. వ్యవసాయ పనుల్లో భాగంగా దమ్ముచేసి వరి నాట్లు వేసే సమయానికి ఎండ తీవ్రంగా కాయడం వల్ల నీరులేక అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీ అమలు చేయాలని కోరుతున్నారు. అలాగే వరినాట్లు వేయడం పూర్తయిన ప్రాంతాలకు సాగునీటి వనరులు కల్పించాలని, ఎరువులు, క్రిమిసంహారక మందులు సమకూర్చాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

మున్సిపల్ పాఠశాలకు సౌండ్‌సిస్టమ్ వితరణ

సాలూరు: పట్టణంలోని వడ్డీవీధి మున్సిపల్ మోడల్ ప్రైమరీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బుడ్డెపు మురళి తాను పనిచేస్తున్న పాఠశాలకు సుమారు రూ.40 వేల విలువ చేసే సౌండ్ సిస్టమ్‌ను వితరణగా అందించారు. గురువారం మెగా పేరెంట్స్, టీచర్స్ డే మీటింగ్‌లో పాఠశాల విద్యాకమిటీ చైర్మన్‌కు సౌండ్ సిస్టమ్‌ను అందించారు. విద్యార్థులు లక్ష్యాలతో కూడిన విద్యనభ్యసించి జీవితంలో ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, స్థానిక పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు ఆ శాఖ ఏఈ బి.శ్రీనివాసనాయుడు ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా ట్రాన్స్ కో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 33 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతులతో పాటు కరెంట్ తీగలను ఆనుకుని ఉన్న చెట్లకొమ్మలను తొలగింపు పనుల నేపథ్యంలో గరుగుబిల్లి, గొట్టివలస, గొల్లవానివలస, రావుపల్లి, కొత్తూరు, తులసిరామినాయుడువలస, మరుపెంట, దళాయివలస, బురదవెంకటాపురం, పెద్దూరు, కొత్తపల్లి తదితర గ్రామాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కరెంట్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు. అలాగే సీతానగరం మండలం, బూర్జి సబ్‌స్టేషన్ నుంచి గరుగుబిల్లి సబ్‌స్టేషన్ వరకు రూ.2.50 కోట్లతో విద్యుత్ లైన్ పునరుద్ధరణ పనులు చేపడుతున్నామన్నారు.

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని పరజపాడు ఫీడర్ పరిధిలోని రాజయ్యపేట, దత్తివలస, పరజపాడు, లక్ష్మీపురం, పిప్పలభద్ర గ్రామాలకు శుక్ర వారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ శాఖ అధికారి బి.శంకరరావు ఓ ప్రకటనలో గురువారం వెల్లడించారు. కరెంట్ తీగలకు తాకే చెట్లకొమ్మల తొలగింపు పనుల నేపథ్యంలో ఉదయం 8నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

భామిని: మండలంలోని లివిరి నుంచి కొరమ వరకు గల గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ గురువారం తెలిపారు. 11 కేవీ కొరమ ఫీడర్‌లో చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్టు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

మా పాఠశాలను మా ఊరిలోనే కొనసాగించాలి

● మెగా పీటీఎం సమావేశంలో తల్లిదండ్రుల వినతి



పాఠశాల ఎదుట నిలబడి తమ సమస్యలు వివరిస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

పాలకొండ రూరల్: మధ్య తరగతి కుటుంబాలకు చెందిన తాము రోజువారీ పనులు చేసుకుని తమ పిల్లలను ఊరి బడిలో చదివిస్తున్నామని ... తమ గ్రామ పాఠశాలను మా ఊరిలోనే కొనసాగించాలని పిల్లల తల్లిదండ్రులు విజ్ఞప్తి చేశారు. పాలకొండ మండలం బెజ్జి గ్రామస్తులు గురువారం తమ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన తల్లితండ్రుల సమావేశంలో సమస్యలు వివరించారు. సర్పంచ్ శివ్వాల శ్రీనివాసరావు సమక్షంలో పిల్లల తల్లులు ఒమ్మి స్వాతి, కొంచాడ లక్ష్మి, సుమతి తదితరులు మాట్లాడుతూ తమ పాఠశాలను పక్క గ్రామం తలవరంలో విలీనం చేయటం వలన కలిగే ఇబ్బందులు వివరించారు. జీవనోపాధిలో భాగంగా తాము పనులకు వెళ్లాల్సి ఉంటుందని, పిల్లలను రోజు పక్క గ్రామం తీసుకువెళ్లి తీసుకురావటం సాధ్యం కాదన్నారు. ఒంటరిగా పిల్లలను పంపించటం వలన ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే పలుమార్లు తమ సమస్య అధికారులకు వివరించామన్నారు. తల్లిదండ్రుల సమావేశం ద్వారా మరోసారి విజ్ఞప్తి చేస్తున్నామని తమ వినతిని పరిగణనలోకి తీసుకోవాలన్నారు. ప్రస్తుతం తమ పిల్లలు బడులకు దూరంగా ఉంటున్నారని ఉపాధ్యాయులకు తెలిపారు.

కార్యాలయాల ప్రారంభం ఎప్పుడో...!



తుమరాడలో ప్రారంభానికి నోచుకోని సచివాలయ భవనం

పాలకొండ రూరల్: కూటమి ప్రభుత్వం ఏడాది పూర్తయినా... అభివృద్ధి పనులకు సంబంధించి ప్రకటనలు.. ప్రచారాలు తప్పితే కార్యరూపం దాల్చటం లేదు. వారు సంకల్పించిన కట్టడాలు ప్రస్తుతం ఎక్కడా కానరావటం లేదు. గత వైఎస్సార్ సీపీ హయాంలో గ్రామ స్థాయిలో పూర్తి చేసిన పలు అధికారిక కార్యాలయాలు నేడు పలు చోట్ల ప్రారంభానికి నోచుకోవటం లేదు. దీంతో గ్రామాల్లో విధులు చేపడుతున్న అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. పాలకొండ మండలం తుమరాడ గ్రామంలో నాడు జగన్ సర్కార్ సచివాలయ భవనంతో పాటు రైతుభరోసా కేంద్రం, వెల్‌నెస్ భవనాల నిర్మాణాలు చేపట్టింది. రూ.లక్షలు ఖర్చు చేసి సచివాలయం, దాదాపుగా రైతు భరోసా కేంద్రం పూర్తి చేసింది. వాటిని ప్రస్తుత కూటమి సర్కారు వినియోగంలోకి తీసుకురాకపోవటంతో విలువైన నిర్మాణాలు వృథాగా మిగిలాయి. అక్కడి అధికారులు ప్రస్తుతం పాత భవనాల్లో కాలం వెళ్లదీస్తున్నారు. ఇప్పటికైనా అక్కడి ప్రజాప్రతినిధులు స్పందించి ఈ భవనాలు ప్రారంభానికి ముహూర్తం ఖరారు చేయాలని స్థానికులు సూచిస్తున్నారు.

స్ప్రేయింగ్‌ను పరిశీలించిన రాష్ట్ర పరిశీలకుడు



స్ప్రేయింగ్‌ను పరిశీలిస్తున్న అబ్జర్వర్

సీతంపేట: దోమల నివారణ మందు గ్రామాల్లో ఏ విధంగా స్ప్రేయింగ్ చేశారో రాష్ట్ర పరిశీలకుడు ఎస్.రామచంద్రుడు గురువారం పరిశీలించారు. బూర్జగూడ, కిల్లాడ గ్రామాల్లో ఎన్‌వీబీడీసీపీ ప్రోగ్రాంలో భాగంగా ఐఆర్ఎస్ ఏసీఎం 5 శాతం ద్రావణాన్ని మొదటి, రెండు రౌండ్లలో ఇంటింటికి స్ప్రేయింగ్ చేసే విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఆయా గిరిజన కుటుంబాలను కలిసి మాట్లాడారు. గ్రామాల్లో నమోదైన మలేరియా పాజిటివ్ కేసుల రాడికల్ ట్రీట్మెంట్‌ను ఎలా అనుసరిస్తున్నారో చూశారు. నీరు నిల్వ ఉన్న ప్రదేశాలను పరిశీలించి ఏం చేయాలో సూచనలిచ్చారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమం పక్కాగా నిర్వహించాలన్నారు. ఆయన వెంట సహాయ మలేరియా నివారణాధికారి శ్రీనివాసరావు, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ మోహన్ రావు, ఎంటీఎస్ ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి

సీతంపేట: విద్యార్థినులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఎమ్మెల్యే ఎస్.జయకృష్ణ అన్నారు. స్థానిక కేజీబీవీలో గురువారం జరిగిన మెగా పేరెంట్ అండ్ టీచర్స్ మీటింగ్‌కు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అన్ని సదుపాయాలు కల్పిస్తుందని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కేజీబీవీ ప్రిన్సిపాల్ సీహెచ్ మాధవి, ఎంఈవోలు ఎం.ఆనందరావు, సూర్యచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల కొరత సృష్టిస్తే లైసెన్స్ రద్దు



రైతు కొనుగోలు చేసిన ఎరువులు పరిశీలిస్తున్న ఏడీ

భామిని: రైతులకు అవసరమైన ఎరువుల విషయంలో కృత్రిమ కొరత సృష్టిస్తే దుకాణాల లైసెన్సులు రద్దు చేస్తామని వ్యవసాయ శాఖ పాలకొండ వ్యవసాయ సంచాలకులు కె.రత్నకుమారి హెచ్చరించారు. మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను ఆమె గురువారం తనిఖీ చేశారు. రైతులకు కొనుగోలు చేసిన ఎరువులకు సంబంధించి రసీదులు ఇవ్వాలని సూచించారు. డీలర్ల వద్ద స్టాకు వివరాలు ఉండాలని అన్నారు.

విద్యుత్ సమస్యలపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక సభ్యులు

వీరఘట్టం: విద్యుత్ సమస్యలపై ప్రతీ విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని ఏపీఈపీడీసీఎల్ విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక న్యాయస్థానం చైర్మన్ డాక్టర్ సత్యన్నారాయణ అన్నారు. వీరఘట్టం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యంగా ప్రతీ ఇంటి కరెంట్ వైరింగ్ చేసేటప్పుడు ఎర్తింగ్ కూడా ఉండాలన్నారు. ఇంటికి ఎర్తింగ్ ఉంటే పిడుగులు పడినప్పుడు ఎటువంటి ప్రమాదాలు జరగవని సూచించారు. అలాగే ఇంటిలో మనం వాడే ఫ్యాన్లు, బల్బులు, టీవీ, వాషింగ్ మిషన్, ఏసీ తదితర ఎలక్ట్రానిక్ వస్తువులు వాడేటప్పుడు అయ్యే కరెంటు వినియోగంపై కూడా విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక సభ్యులు ఎస్.సుబ్బారావు, ఎస్.రాజబాబు, ఎన్.మురళీకృష్ణ, పార్వతీపురం మన్యం జిల్లా ట్రాన్స్‌కో ఎస్ఈ కె.మల్లికార్జునరావు, ఈఈ టెక్నికల్ డి.పురుషోత్తం ప్రిన్సిపాల్ జి.డి.ఎస్ త్రినాధ్ తదితరులు పాల్గొన్నారు.